# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 7, డిసెంబర్ 2025




## ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలి

*** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి సేవలను పొందడం ప్రతి పౌరుడి హక్కు అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో అవినీతి నిరోధక శాఖ మిగతా 2లో..

# ఎన్నికల భద్రత కట్టుదిట్టం

**✪ జిల్లా ఎస్పీ నితికా పంత్ ✪ కాగజ్‌నగర్‌లో ఫ్లాగ్ మార్చ్**

**కాగజ్‌నగర్, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ రానున్న పంచాయతీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తయ్యేలా భద్రతా ఏర్పాట్లను బలోపేతం చేశామని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ఎన్నికల వాతావరణాన్ని నిశితంగా



పర్యవేక్షించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. శనివారం ఎస్పీ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ పట్టణంలోని రాజీవ్ చౌరస్తా నుంచి ప్రధాన మార్కెట్ వరకు భారీగా పోలీసు సిబ్బందితో ఫ్లాగ్మార్చ్ నిర్వహించారు. పట్టణంలో పోలీసులు భారీగా కనిపించడంతో ఓ పక్క ప్రజలకు భరోసా కలిగించగా, అల్లర్లు సృష్టించేవారిలో భయం నింపింది. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, డబ్బు రవాణా, హంగామాలు ఏవీ సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామని, అవసరం అయితే బైండోవర్ చేసి పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న గ్రామపంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా జరగడానికి పోలీస్ భద్రత పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రజల్లో నమ్మకం పెంపొందించడం, శాంతి పరిస్థితులను పర్యవేక్షించడం, ఎన్నికల సమయంలో అసాంఘిక/అవాంఛనీయ చర్యలను అరికట్టడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని ఎస్పీ తెలిపారు. ఎవరైనా గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడటం, అక్రమ ప్రవర్తనలు చేయడం లేదా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించడం లాంటి చర్యలకు పాల్పడితే చట్ట పరమైన మిగతా 2లో..





**అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత**

# ప్రతీ ఒక్కరిపై ఉంది

**ఆసిఫాబాద్, డిసెంబర్ 6, ప్రభాతవార్త :**

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం ఆయన పోరాటం ప్రతి తరానికి స్ఫూర్తియని. అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా చాటి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకురాలు మర్సకోల సరస్వతి, అహ్మద్, భీమేష్, గంధం శ్రీను, చిలువేరు వెంకన్న, నిస్సార్, నారాయణ, జీవన్, వామన్ తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతిని జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌరస్తా, ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గ ఇంచార్జ్ అజ్మీర శ్యాంనాయక్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండ శ్యామ్ తదితరులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం మిగతా 2లో..

# ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**✻ మంచిర్యాల డీసీపీ భాస్కర్**



**జన్నారం, డిసెంబర్ 06, ప్రభాతవార్త**

సర్పంచ్ ఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. ఈ నెల 11న జరిగే సర్పంచ్ ఎన్నికల దృశ్య శనివారం జన్నారం మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో కవాతు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు పోలీసులు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని, ఎన్నికల సమయంలో అక్రమ రవాణా, డబ్బు పంపిణీ, బెదిరింపులు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠినంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకునేలా పోలీసు విభాగం పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు చేసిందని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఎన్నికలు శాంతి యుతంగా పూర్తవుతాయని మిగతా 2లో..

# ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

**☆ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ పట్టణం, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే పిఒ, ఎపిఓలు తమ బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వర్తించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శనివారం మామడ మండల కేంద్రంలోని రైతువేదికలో ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే పిఒ, ఎపిఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. శిక్షకులు అందిస్తున్న శిక్షణ సరళిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో పిఓల పాత్ర కీలకమని తెలిపారు. మండలాలవారిగా పీఓలకు, మిగతా 2లో..



## ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

డిఎస్‌పి జి. మధు, ఇన్స్పెక్టర్‌లు ఎం.స్వామి, ఎన్.కిరణ్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌లతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 3వ తేది నుంచి 9వ తేదీ వరకు జిల్లాలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సేవలను పొందడం ప్రతి పౌరుడు హక్కు అని, దేశ పౌరులకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే 1064 నంబర్ కు డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చుని, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల భద్రత కట్టుదిట్టం

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదని అన్నారు. ప్రజలు ఎన్నికల నియమాలను పాటించాలని, డబ్బులు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 3 ప్రధాన చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేశామని అన్నారు.ఎన్నికల సమయంలో ప్రజ భద్రతలకు భంగపరిచే ఏ చర్యలకైనా జిల్లా పోలీసులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఫ్లాగ్మర్లో డీఎస్పీ వహీదుద్దీన్, టౌన్ ఎస్హెచ్ఓ ప్రేమక్కుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, ఎస్సైలు సుధాకర్, ప్రశాంత్, సందీప్,కళ్యాణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది

(మొదటిపేజీ తరువాయి)

అందించాయన్నారు. ఆయన చూపిన మార్గం శాశ్వతమన్నారు. కేంద్రంలోని బిజెపి చేస్తున్న దుశ్చర్యలకు వ్యతిరేకంగా ఓట్ల చోరీ పై కాంగ్రెస్ చేపట్టిన దేశవ్యాప్త సంతకాల సేకరణలో ప్రతి పౌరుడు పాల్గొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలిని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## నూతన విత్తన చట్టం-2025పై విత్తన డీలర్లకు అవగాహన

ఆసిఫాబాద్, డిసెంబర్ 6, ప్రభాతవార్త:

నూతన విత్తన చట్టం–2025 పై విత్తన డీలర్లకు జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ అవగాహన కల్పించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనకపూర్ రైతువేదికలో జిల్లా లోని విత్తన డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే విత్తన చట్టం–2025 గురించి కీలక అంశాలను డీలర్లకు వివరించారు. ప్రస్తుత విత్తన చట్టం–1966తో పోల్చి కొత్త చట్టంలో అమలుకాబోయే మార్పులు, నియమ నిబంధనలు, డీలర్లు పాటించవలసిన విధానాలను స్పష్టంగా వివరించారు. కొత్త విత్తన చట్టంపై డీలర్లకు ఎలాంటి అభ్యంతరాలు, సూచనలు, సలహాలు ఉన్నా అవి రాతపూర్వకంగా డిసెంబర్ 11, 2025 లోపల జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి గాని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఇ మెయిల్ అడ్రెస్‌కి పంపించాలని అధికారులు చెప్పారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీలర్లు కొత్త చట్టం అమలులో తమ సందేహాలు, అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారులు రైతులకు మేలు చేసే విధంగా చట్ట ప్రభావం, అమలు పద్ధతులపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్నగర్ సహాయ వ్యవసాయ సంచాలకులు మిలింద్ కుమార్, మనోహర్, మండల వ్యవసాయ అధికారులు, జిల్లాలోని విత్తన డీలర్లు కాచం నాందేవ్, తాటిపల్లి ఆశిష్, పుల్లూరి శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్

# శాంతియుత వాతావరణం ఎన్నికల నిర్వహణ లక్ష్యం

**✳ ప్రజల్లో నమ్మకం, భరోసా కోసం ఫ్లాగ్ మార్చ్ ✳ మంచిర్యాల ఏసీపీ ప్రకాష్**

లక్షెట్టిపేట, డిసెంబర్ 06, ప్రభాతవార్త

రాబోయే పంచాయతీరాజ్ ఎన్నికలు నేపథ్యంలో రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ తిమ్మాపూర్ గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది. ఈ మార్చ్‌లో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, పోలీస్ అధికారులతో కలిసి ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రజల్లో నమ్మకం పెంపొందించడం, శాంతి భద్రతలు కాపాడడం, ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడం లక్ష్యంగా నిర్వహించడం జరిగింది. ప్రజలందరూ ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి, ఎన్నికల నియమాలను పాటించి, మీ గ్రామాల్లో చట్ట వ్యతిరేకమైన, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో, గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడటం, గొడవలకు పాల్పడడం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపతంగా, శాంతియుత ఎన్నికలు నిర్వహించడానికి కట్టుబడి ఉంది అని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో లక్షెట్టిపేట సిఐ రమణ మూర్తి, లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్, జన్నారం ఎస్ఐ అనూష, దండేపల్లి ఎస్ఐ తైసినోద్దీన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వర్తించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎపిఓలకు ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. పిఓలు బాధ్యతాయుతంగా తమ విధులుపూర్తి చేయాలన్నారు. పీఓలకు ఎన్నికల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. అధికారులకు సమయపాలన, క్రమశిక్షణ అత్యంత కీలకమని చెప్పారు. ఎన్నికల విధులు పారదర్శకంగా, జవాబుదారీతనంతో, ఖచ్చితత్వంతో నిర్వర్తించాలని వివరించారు. ఎన్నికల నియమావళిని అనుసరించి అధికారులకు అప్పజెప్పిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి, ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్నా పైఅధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులపై పీఓలకు పలు ప్రశ్నలు అడిగారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు అధికారులు జవాబులు ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, డీఈఓ భోజన్న, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సుశీల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, లక్షటిపేట సిఐ రమణ మూర్తి, జన్నారం, దండేపల్లి ఎస్ఐలు గొల్లపల్లి అనూష, తైసినోద్దీన్ పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డిఎంఎల్‌టి, ఎమ్ఎల్‌టి విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు

మంచిర్యాల, డిసెంబర్ 6, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల ఒకేషనల్ జూనియర్ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు కళాశాల డిఎంఎల్‌టి, ఎంఎల్‌టి విద్యార్థిని విద్యార్థులకు తల సేమియా సికిల్ సెల్ వ్యాధులపై, రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తల సేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరగగా, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాసర్ల శ్రీనివాస్ హాజరై అవగాహన పరుస్తూ తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిని నివారించడానికి పెళ్లికి ముందు హెచ్‌బిఏ 2 రక్త పరీక్షలు చేసుకోవాలని, అలాగే ఇద్దరు వ్యాధి వాహకాలు పెళ్లి చేసుకోకూడదని ఒకవేళ పెళ్లి చేసుకుంటే వారికి పుట్టబోయే సంతానము 50 శాతం నార్మల్ పిల్లలు 25 శాతం వ్యాధి వాహకాలు 25 వ్యాధిగ్రస్తులు పుడతారు. అలాగే తలసేమియా వ్యాధిగాస్తుడికి ప్రతి 15, 20 రోజులకు ఒకసారి జీవితాంతము సెలైన్ వాష్డ్ చేసిన ఎర్ర రక్తము జీవితాంతము ఎక్కించాలి. ఖరీదైన ఐరన్సులేషన్ మందులు వాడాలి. సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు కూడా జీవితాంతము ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరు నెలలకు ఒకసారి వ్యాధి తీవ్రతను బట్టి జీవితాంతము రక్తం ఎక్కించాలి అని తెలిపారు. ఈ వ్యాధిని అరికట్టడానికి పెళ్లికి ముందు హెచ్‌బిఏ టు రక్త పరీక్షలు చేసుకోవాలని వ్యాధిని పూర్తిగా నయం చేయడానికి బోన్ మ్యారో మార్పిడి చేయించుకోవాలని బోన్ మ్యారో మార్పిడి ద్వారా వ్యాధి నయమైతుందని తెలిపారు. ఈ బోన్ మ్యారో మార్పిడి హైద్రాబాద్ హాస్పిటల్ ఉచితంగా చేయడని లో అందుబాటులో ఉన్నదని కావున ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాళ్లని తెలిపారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, తల సేమియా వెల్ఫేర్ సొసైటీ నాయకుడు రత్నం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు కై సీఐటీయూ పోరాటం

జైపూర్, డిసెంబర్ 06, ప్రభాతవార్త




లేబర్ కోడ్స్ రద్దు కై సీఐటియూ పోరాటం చేస్తుందని సీ . ఐ . టీ . య్ ూ నాయకులు అన్నారు. శనివారం జైపూర్, భీమారం మండలాల్లో సిఐటియు ఆధ్వర్యంలో డిసెంబర్ 7,8,9 వ తేదీలలో జరుగుతున్న సీఐటియు రాష్ట్ర 5వ మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగుసరిత, మనుబోతుల మధునమ్మ సీఐటీయు మండల నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కరమే ధ్యేయంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం సీఐటీయూ అని అన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దానికి సహకరించడం చాలా దారుణమని అన్నారు. బ్రిటిష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను రద్దు చేస్తూ, కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విదంగా ఈ చట్టాలను తెచ్చారని అన్నారు. ఈ చట్టాలు అమలు జరిపి కార్మికులను బానిసలుగా మార్చడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయన్నారు. మధ్యాహ్నం భోజన కార్మికులు పరిస్థితి చాలా దుర్భరంగా మారిందన్నారు. సకాలంలో బిల్లులు విడుదల చేయకుండా ప్రభుత్వం వేట్టి చాకిరీ చేయించుకుంటూ కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తుందన్నారు. మెనూకు బడ్జెట్ పెంచాలని, కోడిగుడ్లు, గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రతి కార్మికురాలికి ప్రతినెల 10 వేల రూపాయల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేద కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన పోరాటాలను, భవిష్యత్తు కార్యచరణను ఈ రాష్ట్ర మహాసభలలో చర్చించుకోవడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 7వ తేదీన మెదక్ పట్టణంలో జరిగే ర్యాలీ ప్రదర్శన, బహిరంగ సభలో అధిక సంఖ్యలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనసూర్య, గురువమ్మ, విజయ, శ్యామల, లక్ష్మి సవిత, మంజుల, పద్మ, బుధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీడి స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతం చేయాలి

**- జిల్లా వైద్యాధికారి డాక్టర్ సీతారాం**

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :



నాన్ కమ్యూనికేబుల్ డిసిజెస్ (ఎన్‌సీడి) స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సీతారాం వైద్యాధికారులు సిబ్బందిని ఆదేశించారు. శనివారం నెలవారి సమీక్ష సమావేశంలో భాగంగా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పీహెచ్‌సి కాగజ్‌నగర్, యూపీహెచ్‌సి సర్‌సిల్క్ కాలనీ,యూపిహెచ్‌సి నవేగాంబస్తీ, భట్టుపల్లి, ఈస్గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన స్క్రీనింగ్‌ల సంఖ్య, ఫలితాలు, సవాళ్లు,భవిష్యత్తు ప్రణాళికలకు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ సీతారాం మాట్లాడుతూ కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పీహెచ్సీలు, సబ్సెంటర్ల పరిధిలో 30 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికీ బీపీ,షుగర్ వ్యాధుల పరీక్షలు నిర్వహించి స్క్రీనింగ్ టెస్టులు చేయాలని సూచించారు. అదే విధంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎన్‌సీడీ పై పలు మార్గదర్శకాలు చేశారు. అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి నిర్దేశించిన గడువులోగా ఎన్‌సీడి స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎన్‌సీడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఈస్గాం పీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజీమ్, సీహెచ్‌ఓ కోటేశ్వర్, ఆయా పీహెచ్‌సీ, యూపిహెచ్‌సిల వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా అంబేద్కర్ ౬౯వ వర్ధంతి వేడుకలు



**బజార్‌హత్నూర్, డిసెంబర్ 06, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ ఆవరణలో ధర్మ సమాజ పార్టీ ఆధ్వర్యంలో డా.బిఆర్ అంబేద్కర్ 69 వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవలను కొనియాడారు. సమానత్వం, న్యాయం, హక్కుల కోసం అంబేద్కర్ చూపిన మార్గం నేటికీ ప్రతీ భారతీయుడికి ప్రేరణ అని, ఆయన ఆలోచనలు యువతలో మరింతగా వ్యాప్తి చెందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకులు సర్కిల్ నరేష్, చట్ల వినీల్, గాండ్ల స్వామి, కానిందే ఉద్దవ్, కళ్లెం విట్టల్ పడవాల్ రాజు, దర్శన్కర్ కైలాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**సారంగాపూర్, డిసెంబర్ 06, ప్రభాతవార్త:**

మండలంలోని పలు గ్రామాల్లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి పురస్కరించుకొని గ్రామాల నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జాం గ్రామంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అంబేద్కర్ దేశానికి శాశ్వత ఆదర్శఘటకుడు అని కరిపే విలాస్ తెలిపారు. ఆయన రాజ్యాంగం ద్వారా ప్రజలకు లభించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కారణంగా సమాజం బేధాభిప్రాయాలు తగ్గి సంఘటితంగా జీవించే స్థితికి చేరిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు విలువను దేశానికి వివరించిన మహనీయుడు అంబేద్కర్ అని అభిప్రాయపడ్డారు. ఆయన చూపిన బాటలో నడవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. బడుగు బలహీన వర్గాలు విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో ముందుకు వచ్చినప్పుడే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చారి, మహేందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఉట్నూర్, డిసెంబర్ 06, ప్రభాతవార్త:**

అంబేద్కర్ అడుగుజాడలో ప్రతి ఒక్కరు నడవాలని జాడి వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని దంతనపల్లి, ఉట్నూర్ గ్రామంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి ఒక్కరు స్వచ్ఛయుత వాతావరణంలో జీవించడానికి రాజ్యాంగమే కారణమన్నారు. ప్రతి ఒక్కరికి జీవించే హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కు దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, ప్రభాకర్, సిడం జంగుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

**బోథ్, డిసెంబర్ 06, ప్రభాతవార్త:**

భారత రాజ్యాంగ రక్షణే నవభారత రాజ్యాంగ నిర్మాత, న్యాయ కోవిదుడు, అంటరానితనం అసమనాతలను రూపుమాపిన మహానుభావుడు డాక్టర్ బాబాసాహెబ్‌కు నిజమైన నివాళి అని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు కంది ప్రవీణ్ కుమార్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బోథ్ పట్టణ కేంద్రంలో బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పంచశీల జెండాను అవతనం చేసి రెండు నిమిషాల మోనం పాటించి, సందిగ్ధ కాలంలో ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించాలని, కుల, మత, జాతి, వర్గ వివక్ష అసమానతలు లేకుండా అందరికీ హక్కులు కల్పించాడని మానవ సమూహ హక్కులు కాపాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూడాల స్వామి, పసుల చంటి, మెరుగు భోజన్న, వెంకటేష్ చిటికేసి, అబూద్, షాకిర్, ఇర్షద్‌పలు యువజన సంఘాల సభ్యులు పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు.

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటానికి ఘనమైన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక భారత దేశ నిర్మాత, దేశ చరిత్రలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చిన అత్యంత ప్రభావశీలుడైన నాయకుడు, భారత రత్న , రాజ్యాంగ నిర్మాత ,నిత్యం ప్రజల కోసమే పరితపించిన మహోన్నత నేత అని అన్నారు. అంబేద్కర్ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం పరితపించిన వ్యక్తి అని ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గులాబ్ రావు,మోహన్ దుర్గం, రజిత, శారద, సంతోషి రేఖ,ఫహీమున్నిస విద్యార్థులు పాల్గొన్నారు.

**తాండూర్, డిసెంబర్ 6, ప్రభాతవార్త :**

మండలంలోని ఐబీ, కాసిపేట, మాదారం త్రీ ఇంక్లైన్లో శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను దళిత సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత రాజ్యాంగాన్ని రూపొంది ంచడంలో అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు జాడి పోశం, గొల్లపల్లి వెంకటేశం, ఎండి ఈసా, సిరంగి శంకర్, జుబేర్, విష్ణు కళ్యాణ్, ముడిమడుగుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం విదేశాలకు అనుసరణీయం

**- సింగరేణి డైరెక్టర్ తిరుమలరావు**



**జైపూర్, డిసెంబర్ 06, ప్రభాతవార్త**

భారత రత్న, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం విదేశాలకు అనుసరణీయం అని సింగరేణి డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమలరావు అన్నారు. శనివారం ఆయన మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఈడీ చిరంజీవితో కలిసి ఆయన సందర్శించారు. ఎస్టిపిపి పరిపాలన భవనంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమము నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ తిరుమలరావు మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిన్న కుటుంబంలో పుట్టి, ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ ఆయన ఎంతో కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి,మన దేశానికి దిక్సూచిలాంటి రాజ్యాంగాన్ని అందించారని అన్నారు. ఇప్పటికి కొన్ని దేశాలు సరైన రాజ్యాంగం లేక అభివృద్ధి చెందలేకపోతున్నయన్నారు. అంబేద్కర్ జీవితాన్ని, ఆయన సాధించిన లక్ష్యాలను, ఆయన చేసిన పోరాటాన్ని, ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన కలలు కన్నా సమ సమాజ నిర్మాణ స్థాపనకి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, తద్వారా దేశం అభివృద్ధికై పాటుపడాలని అన్నారు. మన సింగరేణి సంస్థ అనేది ఇంతకు ముందు బొగ్గు మీద ఆధారపడేది,బొగ్గు కొన్నాళ్ళకు అంతరించిపోతుందని, మార్కెట్ పరంగా పోటీ తత్వం పెరిగిందని, వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించాలన్నారు. సింగరేణి సంస్థ మనుగడకు బొగ్గుతో పాటు ప్రస్తుతం మన సింగరేణి సంస్థ విద్యుత్ ఉత్పత్తి రంగంలో కూడా అడుగుపెట్టి, రాష్ట్ర, దేశ అవసరాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. మూడో యూనిట్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. నిర్ణీత సమయంలో ప్లాంటు పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అందరూ కలసి పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్న యాజమాన్యం దృష్టికి తీసుకురావలన్నారు. ప్లాంటు నిర్మాణ విషయంలో యాజమాన్యం నుండి అన్ని రకాల సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. అంబేద్కర్ వర్ధంతి సందర్బంగా డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం తిరుమలరావు ఎస్టిపిపిలోని నర్సరీలో మొక్కను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ జనరల్ మేనేజర్ నరసింహారావు, (పి.సి.ఎస్ అండ్ ఓ అండ్ ఎం) జనరల్ మేనేజర్ మదన్మోహన్, సీ.ఎం.ఓ.ఏ.ఐ ప్రెసిడెంట్ పంతులా, ఏఐటియుసి పిట్ సెక్రెటరీ సత్యనారాయణ, ఫైనాన్సు ఏ.జీ.ఎం మురళీధర్, సోలార్ ఏ.జీ.ఎం ఎస్. శ్రీనివాస్, ఈ అండ్ ఎం ఏ.జీ.ఎం సుధాకర్ రెడ్డి, ఎస్సి లైసన్ ఆఫీసర్ జనగామ శ్రీనివాస్, ఎస్టి లైసన్ ఆఫీసర్ దేవేందర్ సింగ్, బిసి లైసన్ ఆఫీసర్ వీరబ్రహ్మం, పర్సనల్ డీజీఎం డి. కిరణ్ బాబు,ఫారెస్ట్ మేనేజట్ చంద్రమణి ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**మంచిర్యాల,డిసెంబర్ 6 ప్రభాతవార్త**

మంచిర్యాల శాసన సభ్యులుకొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదేశాల మేరకు, పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలోభారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్బంగా మంచిర్యాల ఐబీలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు రామగిరి బానేష్, మంచిర్యాల్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, బీసీ సెల్ అధ్యక్షులు వడ్ల రాజమోళి, పీసీసీ సభ్యులు కొండ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు బడుగు శ్రీనివాస్



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు బి.ఆర్. అంబేద్కర్

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

భారతదేశానికి మహోన్నతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా సహకార అధికారి హనుమంత రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఇతర అధికారులతో కలిసి హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన భారత దేశానికి రాజ్యాంగం అందించారని, మొదటి కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా విశిష్ట సేవలు అందించారని తెలిపారు. సంఘసంస్కర్తగా అంటరానితనాన్ని రూపుమాపేందుకు కృషి చేశారని, న్యాయవాదిగా, అధ్యాపకుడిగా, ఆర్థికవేత్తగా నిన్ను పదవులను దేశానికి సేవలు అందించారని తెలిపారు. దేశానికి విశేష సేవలు అందించినందుకు అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నతో గౌరవించడం జరిగిందని, దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



**నార్నూర్, డిసెంబర్ 06, ప్రభాతవార్త:**

బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయలతో సమ సమాజ నిర్మాణం జరగాలని జిల్లా పరిషత్ పాఠశాల హెడ్ మాస్టార అనిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పాఠశాలలో అంబేద్కర్ వర్ధంతినీ జరుపుకున్నారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రచించిన గొప్ప మేధావి అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాథోడ్ ఆశ్విన్ మరియు ఝాడే నాందేవ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కుల నిర్మూలనకు అంబేద్కరిజమే శరణ్యం

**బెల్లంపల్లి, డిసెంబర్ 06, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా కాంట ఏరియాలో ఉమ్మడి దళిత సంఘాల ఐక్య వేదిక 2 ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతిని ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు చిలుక రాజనర్సు మాట్లాడుతూ మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలోని అంబవాడలో వెనకబడిన మహర్ కులానికి చెందిన రాంజీ సత్పాల్ మలోజీ, భీమబాయి దంపతులకు 14వ సంతానంగా బీమ్ రావు జన్మించాడు. అయన విద్యాబ్యాసం కూడా చాల అవమానాలతోనే సాగింది. అందరూ విద్యార్థులు తరగతి గదిలో కూర్చొని చదువుకుంటే అంబేద్కర్ మాత్రం తరగతి గది బయట కూర్చొని చదువుకునే వాడు. ఆ సమయంలో ఉపాధ్యాయుడు బోర్డు మీద ఒక లెక్క రాసి విద్యార్థులతో చేయమనగా ఎవరు చేయకపోవడంతో ఆ లెక్కను భీమ్ రావు సునాయసంగా చేయగా ఆయనలోని ప్రతిభ గుర్తించిన ప్రత్యేక చొరవ తీసుకొని విద్యాభ్యాసం చూపించడమే కాకుండా ఆయన పేరును అంబేద్కర్‌గా పెట్టారు. ఆయన ఎన్నో ఒడిదుడుకుల మధ్య బరోడా రాజు సహాయంతో లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసించి ఎన్నో డిగ్రీలు పొందారు, విద్యా పూర్తి అయ్యాక బరోడా రాజు వద్ద కొలువులో చేరారు. ఉన్నత స్థాయిలో ఉద్యోగంలో ఉన్న కూడా నిమ్న కులం కావడంతో ఆయన కింది స్థాయి ఉద్యోగుల నుండి కూడా చాల అవమానాలు ఎదురుకున్నారన్నారు. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి కొన్ని పత్రికలు నడిపాడు అస్పృశ్యుల మీద అణగారిన వర్గాలపై వివక్షను ప్రశ్నించాడు. 1932లో మెక్ డోనాల్డ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల సందర్భంగా కమ్యునల్ అవార్డ్ ద్వారా నిమ్న వర్గాలకు ఓటు హక్కుతో పాటు ప్రత్యేక నియోజక వర్గాలను కల్పించారన్నారు. అదేకాకుండా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ న్యాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో స్త్రీలకు విద్య, ఉపాధి, ప్రసూతి సెలవులు, ఆస్తిలో సమాన వాటా కోసం హిందూ కోడ్ బిల్ ప్రవేశ పెట్టారు. అప్పటి ప్రభుత్వానికి సంపూర్ణంగా మెజార్టీ ఉన్నప్పటికీ హిందూ కోడ్ బిల్ విడిపోవడంతో తన న్యాయ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి మహిళల పక్షపాతిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. మహద్ గ్రామంలోని చౌదర్ చెరువు వద్ద త్రాగు నీరు కోసం సత్యహగ్ర పోరాటం చేశారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డాక్టరేట్ కోసం ఆయన రాసిన ప్రోబ్లం ఆఫ్ రూపీ అనే గ్రంథం రాయడం కారణంగానే రిజర్వు బ్యాంక్ ఏర్పాటు చేశారన్నారు. అందువలన ఇండియా కరెన్సీ నోట్లపైన అంబేద్కర్ ఫోటోను ముద్రించాలని దళిత సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేస్తుంద న్నారు. మన దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మన దేశానికి రాజ్యాంగాన్ని రాయడంలో ఆయనే ప్రధాన భూమిక పోషించినందున ఆయనను భారత రాజ్యాంగ నిర్మాత అని గౌరవిస్తారు అన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారానే మనకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది అన్నారు. అంబేద్కర్ గొప్పతనాన్ని, జ్ఞానాన్ని, మేదోపటిమను గుర్తించిన ప్రపంచ దేశాలు ఆయన పుట్టిన రోజును ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా నామకరణం చేసిందన్నారు. చివరగా ఆయన హిందూ మతాన్ని వొదిలి బౌద్ధ మతాన్ని లక్షలాది మందితో కలిసి స్వీకరించారన్నారు. ఆయన 1956 డిసెంబర్ 06 తేదీన ఢిల్లీలోని ఆయన స్వగృహంలో నిద్రలోనే మహానిర్యాణం చెందారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన ఘన నివాళిలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గోమాస రాజం ప్రధాన కార్యదర్శి, కారెంగుల మల్లేష్ కార్యదర్శి, ఎల్తూరి శంకర్, గంగారపు రమేష్‌కార్యదర్శి, మాస మురళి సలహాదారు, కాసర్ల యాదగిరి, సబ్బాని రాజనర్సు, ఎనగందుల శివాజీ, గోగర్ల శేఖర్, మహేందర్, రాంచందర్, ఆరేపల్లి బానేష్, రామగిరి రాజలింగు, బూడిద శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం

### - శ్రీరాంపూం జీఎం మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల ద్వారానే బలహీన వర్గాలకు ఉన్నత అవకాశాలు, సామాజిక న్యాయం, సమానత్వం సాధ్యమయ్యాయి అని శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏరియా ఎస్సీ లైజన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని, కార్యాలయం ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎస్ఓటు జీఎంతో పాటు ఇతర అధికారులు అంబేద్కర్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ



సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, అణగారిన, దళిత, బహుజన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహావ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు గోషిక మల్లేషం, యుగంధర్ సాయి బుద్ధివందనం, పంచశీల పఠనం నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, ఉద్యోగుల సంఘం బ్రాంచి అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, ఎస్టీ లైజన్ ఆఫీసర్ గుండే రావు, లా ఆఫీసర్ ఎం. మల్లేష్, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి సందీప్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ నెలబోయిన కుమార్, ఇతర సీనియర్ అధికారులు, బీసీ, ఓబీసీ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాల సాధనకు పోరాటం చేయాలి

### - పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు

**లక్షెట్టిపేట, డిసెంబర్ 06, ప్రభాతవార్త**

సమసమాజం కొరకు నిరంతరం పరితపించిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆని అయన ఆశయాలు సాధించడానికి నిరంతరం పోరాటం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఇటిక్యాల చౌరస్తాలో భారత రాజ్యాంగ రూపకర్త, విద్యావేత్త, బడుగు బలహీనర్గాల ఆశాజ్యోతి మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మానసికంగా ఉన్నతంగా ఆలోచించాలని, మానసికంగా అభివృద్ధి చెందితేనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. సంపూర్ణ మానవునిగా ఎదగాలంటే అహంకారం వదిలేయాలని, ఈర్ష్య, ద్వేషాలు, వదిలి, ప్రేమపూర్వకంగా కుల, మత, లింగ బేదాల్లేకుండా జీవించాలన్నారు. రాజకీయ నాయకుల వద్ద బానిసత్వం చేయకుండా ఆత్మగౌరవంతో జీవించాలని సూచించారు. ఈ కార్యక్రంలో సీనియర్ నాయకులు తోగరు కాంతయ్య, దొంత నరసయ్య, మాలెం చిన్నన్న, తోగరు గంగరాం, సుంకె శంకర్, తోగరు బాపు, గడమల్ల చంద్రయ్య, తోగరు ప్రసాద్, గంధం లింగయ్య, గడమల్ల మల్లేష్, కండె మొగిలి, గంధం సందీప్, నీరటి మొగిలి, గొట్టె సతీష్, పానగంటి శేఖర్, తొగరు శ్రీహరి, బీసీ నాయకులు నిమ్మ రత్నాకర్ పెట్టెం తిరుపతి, పెట్టెం స్వామి, ఎనగందుల స్వామి, మందపల్లి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.









# ఎంపి చిత్రపటానికి పాలాభిషేకం

**మంచిర్యాల, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శనివవారం లక్ష్మీనగర్ యందు విశ్రాంత బొగ్గు ఉద్యోగులకు కనీస పెన్షన్ పదివేలు ఇవ్వాలని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటానికి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సింగరేణి సంస్థలో మూడు నుంచి నాలుగు దశాబ్దాల పాటు పనిచేసి సంస్థ అభివృద్ధి కొరకు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన సింగరేణి, కోల్ ఇండియా, విశ్రాంత బొగ్గు పెన్షన్ దారులకు కనీస పెన్షన్ పది వేలు ఇవ్వాలని దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా చూడాలని పెద్దపెల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయటం పట్ల సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేస్తూ, శనివారం పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ చిత్రపటానికి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగినది. ఈ సందర్భంగా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ గతంలో 1998లో కేంద్ర కార్మిక శాఖ మంత్రి కీర్తిశేషులు కాక గడ్డం వెంకటస్వామి కృషి వల్లనే సింగరేణి, కోల్ ఇండియాలో, మూడవ బెనిఫిట్‌గా దాదాపు ఆరు లక్షల పైలుకు మంది బొగ్గు విశ్రాంత ఉద్యోగులు ఈ రోజున కోల్ మైన్స్ పెన్షన్ పొందుతున్నారని పేర్కొన్నారు. కానీ, గత అగ్రిమెంటులో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుకూలంగా పెన్షన్ పెంచాలని ఒప్పందం ఉన్న కేంద్ర ప్రభుత్వం కానీ కోల్ ఇండియా యజమాన్యం కానీ, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు కానీ ఒక పైసా కూడా పెంచిన పాపాన పోలేదని ఆవేదన వెలిబుచ్చినారు. సింగరేణిలో వేలాదిమంది విశ్రాంత ఉద్యోగులకు 350, 500 నుంచి 1000 రూపాయల మాత్రమే పెన్షన్ పొందుతున్నారని, దీంతో వారి కుటుంబాలు మనగడ ఎలా సాగుతుందో ఒకసారి కేంద్ర ప్రభుత్వం కోల్ ఇండియా యజమాన్యం, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు మానవత దృష్టి తో ఆలోచించి గత 28 సంవత్సరాల నుండి పెంపుదలకు నోచుకోని కోల్ మైన్స్ పెన్షన్‌ను పెంచే విధంగా తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అదేవిధంగా మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి కాక గడ్డం వెంకటస్వామి స్ఫూర్తితో పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విశ్రాంత బొగ్గు ఉద్యోగులకు కనీస పెన్షన్ పదివేలు ఇవ్వాలని రెండు సార్లు పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం హర్షణీయం అని, ఎంపీ చేస్తున్న పోరాటానికి సింగరేణి, కోల్ ఇండియా లోని దాదాపు ఆరు లక్షల మంది విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, అదేవిధంగా విశ్రాంత బొగ్గు ఉద్యోగులు పెన్షన్ దారులు పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకి ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతాలు ధన్యవాదాలు తెలియజేశారు. కనీస పెన్షన్ 10 వేలకు పెరిగే వరకు ఎంపీ వంశీ కృష్ణ పోరాడాలని మీ వెన్నంటే లక్షలాదిమంది బొగ్గు విశ్రాంత ఉద్యోగులు పెన్షన్‌దారులు ఉంటారని ఈ సందర్భంగా ఎంపికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రాళ్ల బండి రాజన్న, అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, నాయకులు గూడ రాజిరెడ్డి, గోపతి లక్ష్మ్ముణ్, చిప్పరామస్వామి, మామిడాల సత్యనారాయణ, కోట చంద్రమోళి, అడిచెర్ల రాజేశం, పనాస లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు



## బీసీలకు ప్రభుత్వం న్యాయం చేయాలి

**లక్షెట్టిపేట, డిసెంబర్ 06, ప్రభాతవార్త**

బీసీలకు ప్రభుత్వం 42 రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని స్వర్ణకార సంఘం లక్షెట్టిపేట మండల నాయకులు డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల కోసం సాయి ఈశ్వర చారి ఆత్మబలిదానం చేయడంపై వారు శనివారం రెండు నిమిషాలు మోనం పాటించారు. బీసీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



## టిఎస్‌యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 06, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో శనివారం టీఎస్‌యుటిఎఫ్ మహ సభ నిర్వహించి, నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. మండల కార్యవర్గంను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు భగత్ బాపురావ్, ప్రధాన కార్యదర్శి పాముల మల్లయ్య, ఉపాధ్యక్షులు ఎస్ రాజేందర్, కోశాధికారి విజయ్‌కుమార్, కార్యదర్శులు గంగాధర్, భారత్ కుమార్, జీవన్, అనిల్ కుమార్, అమోల్, మహేష్ కన్వీనర్ ఆశ్రాఫ్, మహిళా కన్వీనర్ పరమేశ్వరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారిచటంలో ఎల్లపుడు ముందుంటుందన్నారు. ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని ఆయన ప్రభుత్వానికి కోరారు.



## 56వ రక్షణ పక్షోత్సవాలకు సన్నద్ధంగా ఉండాలి

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**- వార్షిక రక్షణ పక్షోత్సవాలపై సన్నాహక సమీక్ష**

**నస్పూర్, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

రాబోయే 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో శ్రీరాంపూర్ ఏరియా మరోసారి సత్తా చాటాలని, ఆ విధంగా సంసిద్ధంగా ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ గనులు, కార్యాలయాల విభాగాధిపతులు, అధికారులను కోరారు. సోమవారం నుంచి ఈ నెల 19 వరకు శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో వార్షిక రక్షణ పక్షోత్సవాలు జరగనున్న నేపథ్యంలో జీఎం అన్ని గనులు, కార్యాలయాల విభాగాధిపతులతో సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఏడాది సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్ ఏరియా 19 బహుమతులు సాధించడం గర్వకారణం అని జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఈసారి కూడా అదే స్ఫూర్తితో అంతకు మించి బహుమతులు సాధించేలా ఏర్పాట్లు జరగాలని, సింగరేణిలోనే శ్రీరాంపూర్ ఏరియా మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. రక్షణ విషయంలో అన్ని భూగర్భ గనులు, ఓపెన్ కాస్టులు, కార్యాలయాలు తగు చర్యలతో సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. ముందస్తు ప్రణాళికలతో లోటుపాట్లు గుర్తించి, వాటిని తక్షణమే సరిదిద్దుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఎస్ ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ టి. రమణ రావు, ఎస్సార్పీ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఐకె ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి, ఆర్.కె 7 గ్రూప్ ఏజెంట్ కె. రాజేందర్, ఆర్.కె 5 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, సీహెచ్‌పీ ఇంచార్జ్ చంద్రలింగం, ఇంచార్జ్ క్వాలిటీ వెంకటేశ్వర్ రెడ్డి, అన్ని గనుల మేనేజర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలి

**- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్**

**లక్షెట్టిపేట, డిసెంబర్ 06, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ గ్రామ పంచాయతీ బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి వెల్తపు సుధాకర్ బ్యాట్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, లక్షెట్టిపేట మండల అధ్యక్షులు చుంచు చిన్నయ్య, లక్షెట్టిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## బిజెపి నుంచి వీరయ్య రాజీనామా - కాంగ్రెస్‌లో చేరి

**సారంగాపూర్, డిసెంబర్ 06, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో బిజెపికి కీలక నాయకుడిగా, ప్రస్తుత సర్పంచ్ అభ్యర్థిగా ఉన్నా వీరయ్య కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఆయనతో పాటు సతీమణి సారంగాపూర్ తాజా, మాజీ ఎంపిటిసి సామల పద్మ వీరయ్య, 09వ వార్డ్ మెంబర్ దేవి సుధాకర్, పలువురు కార్యకర్తలు చేరికయ్యారు. సారంగాపూర్ తాజా, మాజీ జడ్పీటీసీ సభ్యులు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరిక జరిగింది. ఈ సందర్భంగా పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ కండువా వేసి వీరయ్యతో పాటు 300 మందిని పార్టీలోకి ఆహ్వానించాడు. కాంగ్రెస్ పేదల అభివృద్ధికి కట్టుబడి, మంచి పథకాలను అమలు చేస్తోందనే నమ్మకంతో పార్టీలో చేరుతున్నట్లు వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ్ రాజేశ్వర్, సారంగాపూర్ మండల అధ్యక్షులు బొల్లోజు నర్సయ్య, ఓల్రతి నారాయణ రెడ్డి, కోర్వ నవీన్ రెడ్డి, డీలర్ నారాయణ రెడ్డి, కండెల భూమన్న, దేవి, ముత్యం తదితరులు పాల్గొన్నారు.



## సిర్పూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌కు 7గురు పోటీ

**– ఈసారి పెరిగిన పోటీ – నేటి నుంచి ప్రచారానికి శ్రీకారం**

**సిర్పూర్ (టి), డిసెంబర్ 6 ప్రభాతవార్త :**

సిర్పూర్ మేజర్ గ్రామపంచాయతీకి ఈనెల 14 జరిగే పంచాయతీ ఎన్నికల సందర్భంగా సిర్పూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి పోటీ కోసం పదిమంది నామినేషన్లు వేయగా శనివారం జరిగిన నామినేషన్ల ఉపసంహరణ లోముగ్గురు అభ్యర్థులు మాత్రమే ఉపసంహరించుకున్నారు. మిగతా 7 ఏడు మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. సిర్పూర్ మేజర్ గ్రామపంచాయతీకి 14 వార్డులు ఉండగా 7 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ముగించడంతో ఇక పోరుకు పోటీ అభ్యర్థులు సిద్ధ మయ్యారు. మిగతా పంచాయతీలలో కూడా ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈసారి వార్డు మెంబర్ల కోసం యువత ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అభ్యర్థులు గెలుపు కోసం ఓటర్లను మెప్పించడానికి ప్రకారానికి శ్రీకారం చుట్టా నున్నారు. సిర్పూర్ మేజర్‌గ్రామ పంచాయతీకి ఎన్నిక రసవత్తరంగా జరగనుంది.

# పోలీస్ వ్యవస్థలో హోంగార్డులు కీలక భాగస్వాములు

**- కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్**



ప్రశంస పత్రాలను అందిస్తున్న ఎస్పీ నితికా పంత్

ఆసిఫాబాద్, డిసెంబర్ 6, ప్రభాతవార్త

జిల్లా పోలీస్ వ్యవస్థలో హోంగార్డులు కీలక భాగస్వాములని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ పేర్కొన్నారు. పోలీస్ హోంగార్డుల 63 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వాటర్స్ లో ఏఎస్పీ చిత్తరంజన్ తో కలిసి మొక్కలు నాటారు. ముందుగా పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డులుపోషిస్తున్న పాత్ర విలువైందని తెలిపారు. ప్రజల భద్రత, విపత్తుల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, నేర నియంత్రణ, పోలీస్ బలగాలకు అవసరమైన సహకారం అందించడంలో వారు చూపుతున్న క్రమశిక్షణ, విధేయత, నిబద్ధత పట్ల ప్రశంసలు కురిపించారు. హోంగార్డులు ఎల్లప్పుడూ ముందుండి విధులను నిర్వర్తించడం, పండుగలు, ఎన్నికలు, విశేష కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ప్రజాసేవలో తమ వంతు పాత్రను నిర్వర్తించడం జిల్లా పోలీస్ శాఖకు ఎంతో బలాన్ని అందిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. హోంగార్డుల యొక్క సంక్షేమం గురించి పోలీస్ శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని పేర్కొన్నారు. అనంతరం విధుల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన హోంగార్డులను గుర్తింపుగా ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ హోమ్ గార్డ్స్ విద్యాసాగర్, ఆర్.ఐ అడ్మిన్ వామనమూర్తి, ఆర్.ఐ (ఎం.టి.ఓ) అంజన్న, హోంగార్డు సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



టీ షర్టు పంపిణీ చేస్తున్న మంచిర్యాల డిసిపి

## డీసీపీ చేతుల మీదుగా నాసా టీషర్ట్స్ పంపిణీ

మంచిర్యాల, డిసెంబర్ 6, ప్రభాతవార్త

శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు నాసా ప్రాజెక్టుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు డీసీపీ చేతుల మీదుగా టీ షర్టు పంపిణీ చేశారు. నాసా కోసం ప్రాజెక్ట్ సిద్ధం చేసినందుకు శ్రీ చైతన్య స్కూల్ లక్ష్మీనగర్ బ్రాంచ్ విద్యార్థులను డీసీపీ అగ్గడి భాస్కర్ అభినందించారు. శనివారం తన కార్యాలయంలో డిసిపి అగ్గడి భాస్కర్ ప్రాజెక్ట్ సిద్ధం చేయడానికి విద్యార్థులకు ఉపయోగపడే నాసా కిట్లను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం శ్రీ చైతన్య నుండి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు నాసా ప్రాజెక్టులకు తమ పేర్లను నమోదు చేసుకుంటారని ప్రిన్సిపాల్ అయూబ్ అన్నారు. మంచిర్యాల ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీన్ శ్యామ్, నాసా ఇంచార్జ్ స్వాతి ప్రియాంక,విద్యార్థులు పాల్గొన్నారు.



## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

జన్నారం, డిసెంబర్ 6, ప్రభాతవార్త

గత పదవీ కాలంలో తన భర్త జక్కు భూమేష్ చేసిన అభివృద్ధిని చూసి నన్ను ఆశీర్వదించండి అని సర్పంచ్ అభ్యర్థి జక్కు సుష్మ భూమేష్ అభ్యర్థించారు. జన్నారం మండలం పొనకల్ మేజర్ గ్రామ పంచాయితి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జక్కు సుష్మ భూమేష్ విస్తృత ప్రచారం నిర్వహించారు. శనివారం నాడు పెద్ద ఎత్తున తన అభిమాన కార్యకర్తలు, ఆడపడుచులు, విదేయులతో కలిసి గ్రామ పంచాయితి పరిధిలోని వాడ వాడలా తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాల పదవీ కాలంలో నా భర్త జక్కు భూమేష్ ఎలాంటి అవినీతికి పాల్పడకుండా చేసిన అభివృద్ధిని వివరిస్తూ, నన్ను మరోసారి ఆశీర్వదిస్తే అంతకు మించి అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. మాకు మీ అమూల్యమైన ఓటు వేసి సర్పంచ్ అభ్యర్థి జక్కు సుష్మ భూమేష్ ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, మహిళామణులు, అభిమానులు పాల్గొన్నారు.

## పాఠశాలకు బెంచీలు, కుర్చీలు వితరణ

తాండూర్, డిసెంబర్ 6, ప్రభాతవార్త:

మండలంలోని పెగడపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్థానిక టీచర్ సిరిపురం సుజాత, ఆమె సోదరుడు సత్యనారాయణ తన తండ్రి చిన్నయ్య జ్ఞాపకార్థం రూ.22 వేలు విలువ గల బెంచీలు, కుర్చీలను శనివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం మంచి మనసుతో సత్యనారాయణ బెంచీలు, కుర్చీలు విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు.



మాట్లాడుతున్న హెచ్ఎం దుర్గం శ్రీనివాస్



## నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

**- ఈస్గాంలో ఫ్లాగ్‌మార్చ్**

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :

పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించు కోవాలని కాగజ్‌నగర్ రూరల్ కుమారస్వామ అన్నారు. శాంతియుత వాతావరణంలో పోలింగ్ నిర్వహిం చడమే పోలీసుల లక్ష్యమని, అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శనివారం కాగజ్‌నగర్ మడలం ఈస్గాం ఎస్సై కళ్యాణ్ ఆధ్వర్యంలో సాయుధదళ, పోలీసు సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈస్గాంలోని వేద మందిరం నుండి ఈస్గావ్ చౌరస్తా వరకు ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ కుమారస్వామి మాట్లాడుతూ ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెపొందించడం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తోడ్పాటునందించాలని ప్రజలను కోరారు. ఎన్నికల సమయంలో గొడవలకు దిగినవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తన నియ మావళిని తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల్లో అక్రమా లుడబ్బుల పంపిణీ, బెదిరింపులు, ఓటర్లపై ఒత్తిడి లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సందీప్,పోలీసు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీ జవాన్‌ని సన్మానిస్తున్న యూత్ సభ్యులు

ఉట్నూర్, డిసెంబర్ 06, ప్రభాతవార్త:

భారత దేశ రక్షణ దళాల్లో భాగమై అగ్నివీర్ ఎంపికలో అర్హత సాధించి, కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న హస్నాపూర్ గ్రామ యువకుడు రాథోడ్ అనిల్, శ్రీ స్వామిను శనివారం వివేకానంద యూత్ సభ్యులు, స్వామి వివేకానంద ఉద్యోగస్తుల సంఘం తరుపున అనిల్‌ని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. యూత్ సభ్యులు మాట్లాడుతూ రాథోడ్ అనిల్ సాధించిన ఈ విజయం మా గ్రామ యువతకు ఒక ఆదర్శమని అన్నారు. దేశ సేవలో అడుగుపెట్టిన ప్రతి యువకుడు అన్నివిధాలా ప్రోత్సాహానికి అర్హుడని అగ్నివీర్ శిక్షణను పూర్తి చేసి గ్రామానికి తిరిగి రావడం హస్నాపూర్ గ్రామనికి గౌరవాన్ని మరింతగా పెంచిందన్నారు. మా గ్రామ గౌరవం–మా యువ శక్తిని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, ఉద్యోగులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్మీ జవాన్‌ను సన్మానిస్తున్న యూత్ సభ్యులు

## తాగూర్‌నగర్ వ్యక్తి అనుమానాస్పద మృతి

**- అతిగా మద్యం సేవించడమే కారణమని భార్య ఆరోపణ**

**- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన రామకృష్ణాపూర్ పోలీసులు**

రామకృష్ణాపూర్, డిసెంబర్ 6, ప్రభాతవార్త

తాగూర్ నగర్‌కు చెందిన సుల్తాన్ శ్రీనివాస్ (48) అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. మద్యానికి బానిసైన శ్రీనివాస్ డిసెంబర్ 4వ తేదీ ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని భార్య సుల్తాన్ స్వరూప (45) ఫిర్యాదులో పేర్కొంది. అదే రోజున మధ్యాహ్నం అంగడి బజార్ వద్ద భర్తను చూసినట్లు తెలిపిన ఆమె, తరువాతి రోజు ఇంటికి చేరాక అతను కనిపించకపోవడంతో రైల్వే స్టేషన్, అంగడి బజార్ ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయిందని చెప్పింది. డిసెంబర్ 5వ తేదీ రాత్రి 8 గంటలకు, భర్తతో కూలీగా పని చేసే చంటి ఇచ్చిన సమాచారం మేరకు అక్కడికి చేరుకున్నా, శ్రీనివాస్ కొత్తగా నిర్మాణంలో ఉన్న మార్కెట్ భవనంలో కుప్పకూలి మృతిచెందినట్లు గుర్తించారు. అతిగా మద్యం సేవించడం వల్ల గానీ లేదా ఇతర కారణాల వల్ల గానీ భర్త మృతి చెందినట్లు స్వరూప ఫిర్యాదులో పేర్కొంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జి. రాజశేఖర్ తెలిపారు.



## పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఘనంగా గ్రాండ్‌పేరెంట్స్ డేవేడుకలు

**- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**

నస్పూర్, డిసెంబర్ 6, ప్రభాతవార్త

మంచిర్యాల పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో శనివారం గ్రాండ్‌పేరెంట్స్ డే వేడుకలు అంబరాన్నంటాయి. తరాల మధ్య అనుబంధాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంజేపీటీబీఆర్ ఇంచార్జి ప్రిన్సిపాల్ నాగజ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు తమ తాతామామ్మలతో కలిసి చేసిన సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాత తరం, కొత్త తరం కలసికట్టుగా పాల్గొన్న గ్రూప్ యాక్టివిటీస్, ఆటలు, సంగీత, నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ చేతులతో స్వయంగా తయారు చేసిన గ్రీటింగ్ కార్డులు, చిన్న బహుమతులను తమ పెద్దలకు అందించి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో తరాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి, కుటుంబ విలువలని కాపాడటానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి అని పేర్కొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన పెద్దలు తమ జీవిత అనుభవాలను, విలువలను విద్యార్థులతో పంచుకొని, వారిని ఆశీర్వదించారు. తమను గౌరవించి, ఇంత చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.